క్లుప్తంగా

ఘనంగా సువార్త మహాసభలు



మహాసభల్లో ప్రార్థనలు చేస్తున్న సంఘస్తులు

మొగల్తూరు : స్థానిక పాలపర్తివారిపేటలోని క్రీస్తు లూథరన్ దేవాలయ ప్రాంగణంలో క్రీస్తు సువార్త మహా సభలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బిషప్ రైట్ ఎంఏఎస్ మార్టిన్స్, సీహెచ్ విస్‌హోస్ సువార్తీకులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ మహాసభల్లో సంఘస్తులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మైలాబత్తుల జాన్, వడ్లమూడి వెంకటేశ్వర్లు, నేతల బెనర్జీ, పాలపర్తి జయరాజు, మైలాబత్తుల సుభాష్, స్త్రీల సమాజం, సండే స్కూల్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు



మంచినీటి చెరువును పరిశీలిస్తున్న సర్పంచ్ సువర్ణరాజు

పోడూరు : వేసవి దృష్ట్యా గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుడా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పోడూరు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు తెలిపారు. గ్రామంలో మంచినీటి చెరువును, ఫిల్టర్‌బెడ్‌లను బుధవారం ఆయన పరిశీలించారు. జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా పోడూరు పంచాయతీకి పరిపాలన, మౌలిక వసతులు, ఆరోగ్యం విభాగాల్లో 3 అవార్డులు రావడంపై ఈ సందర్భంగా ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాధరాజు పోడూరు గ్రామాభివృద్ధికి ఎంతో ప్రోత్సాహం, సహకారం అందిస్తున్నారన్నారు. గ్రామాన్ని మరింతగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు.

దళిత వాడల అభివృద్ధిపై దృష్టి సారించాలి



విలేకరులతో మాట్లాడుతున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజు

పాలకొల్లు అర్బన్ : రాష్ట్రంలో దళిత వాడలను అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజు కోరారు. పాలకొల్లు ఏఎంసీ ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు నూటికి నూరుశాతం దళిత వాడల అభివృద్ధికి ఖర్చు చేయాలని కోరారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు మర్రిపూడి నానిబాబు, రాష్ట్ర కార్యదర్శి సంధి జయరాజు, జిల్లా అధ్యక్షుడు నేతల సువర్ణరాజు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నన్నేటి నాగరాజు, భీమవరం మండల అధ్యక్షుడు దాసరి చిరంజీవి, ప్రధాన కార్యదర్శి నల్లి వెంకటస్వామి, చవ్వాకుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం శిక్షణ తరగతులు

పెనుగొండ : పెనుగొండ ఎస్ఆర్‌కే విల్లాలో సీపీఎం శిక్షణా తరగతులు రెండవ రోజు బుధవారం నిర్వహించారు. రాష్ట్రాల హక్కులపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం తగదని, రాజకీయ తీర్మానం నిర్మాణ నివేదిక అంశాలపై శిక్షణ నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జేఎస్‌వీ గోపాలన్, కే నాగేశ్వరరావు, పీవీ ప్రతాప్, కేతాగోపాలన్, ఎస్ వెంకటేశ్వరరావు, కూసంపూడి సుబ్బరాజు, ఎస్‌వీఎస్ శరన్మ, ఏ అజయకుమారి, డి విజయలక్ష్మీ, గార రంగారావు, బళ్ల చిన వీరభద్రం, షేక్ పాదుషా, బత్తుల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రేకుల షెడ్డులో అగ్ని ప్రమాదం

పెనుగొండ : సిద్ధాంతంలోని కరణంగారి వీధిలో బుధవారం రేకుల షెడ్డులో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. తణుకు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో హుటాహుటిన వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. రేకుల షెడ్డులో గోనే సంచులు, ఫ్రూట్స్ ట్రేలు కొంతమేర దగ్ధమయ్యాయని ఎస్ఎఫ్ఓఐ అజయ్‌కుమార్ తెలిపారు. ఆస్తి నష్టం సుమారు రూ.60 వేలు ఉండవచ్చునని అంచనా వేశారు.

చిన్నారులకు గుండె వైద్య పరీక్షలు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక సుందరయ్య భవనంలో వసుధ ఫౌండేషన్, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో 15 ఏళ్లలోపు వయస్సు ఉన్న పిల్లలకు ఉచిత గుండె పరీక్షలు నిర్వహించారు. విజయవాడకు చెందిన ఇంటర్ వెన్షనల్ చిల్డ్రన్ కార్డియాలజిస్ట్ విక్రమ్. కె. పిల్లలకు ఎకో పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. ఆపరేషన్ చేయాల్సిన చిన్నారులను గుర్తించారు. ఆపరేషన్ విజయవాడ ఆంధ్ర హాస్పిటల్‌లో చేస్తామన్నారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు, అల్లూరి సీతారామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రంనకు చెందిన వి.రాధాకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాధనం వృథా కాకుండా పాలన సాగాలి

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల డిమాండ్





సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ , పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు

నరసాపురం : ప్రజాధనం వృథా కాకుండా మున్సిపల్ పాలనా వ్యవహారాలు, అభివృద్ధి పనులు నిర్వహించాలని, ఈ దిశగా అధికారులు వ్యవహరించాలని కౌన్సిలర్లు కోరారు. నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముందుగా కో–ఆప్షన్ సభ్యుడు ఏడిద కోటసత్యనారాయణ (వైకేఎఎస్) మాట్లాడుతూ వేసవిలో డ్రెయిన్లలో సిల్ట్ తొలగించడానికి దాదాపు రూ.20 లక్షలు కేటాయించారని, ఏటా డ్రెయిన్లలో సిల్ట్ తీయడం అనేది తూతూమంత్రంగా సాగుతుందని, దీనివల్ల ప్రజాధనం వృథా అవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే చెత్తడంప్ చేయడానికి కొత్తగా 15వ ఆర్థిక సంఘం నిధులతో 54 వాహనాలు, డస్ట్‌బిన్ల కొనుగోలుపై పునరాలోచన చేయాలన్నారు. పాత డస్ట్‌బిన్స్ ఏమయ్యాయి, ఎన్ని ఉన్నాయని ప్రశ్నించారు. ఇదే అంశంపై సభ్యులు కోటిపల్లి సురేష్, కేసరి గంగరాజు ప్రశ్నించారు. వైకేఎస్ పన్నుల వసూళ్లకు సంబంధించి అధికారుల తీరును తప్పుపట్టారు. పట్టణంలో సికిలే స్కూల్ యాజమాన్యం మున్సిపాలిటీకి రూ.90 లక్షల వరకూ ఆస్తి పన్ను బకాయి ఉందని, వారు కోర్టులను ఆశ్రయించే వరకూ రావడం అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు.

ఫెర్రీ ఆదాయం మున్సిపాలిటీకి వచ్చేలా చూడాలి

మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గోదావరి రేవు పాట ఆదాయం, మండల పరిషత్‌కు వెళుతుందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆ ఆదాయం మున్సిపాలిటీకి వచ్చేలా చూడాలని షేక్ అబేధా సుల్తానా కోరారు. 216 జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా హైవేకు అనుసంధానంగా ఉన్న మున్సిపల్ రోడ్లను సరిగా వేయకపోవడంతో ప్రజలు ప్రమాదాల పాలవుతున్నారని వైస్‌చైర్మన్ కొత్తపల్లి నాని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అంశంపై కావలి రామసీత మాట్లాడుతూ హైవే అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మరో వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని వీధి దీపాలు, పారిశుధ్య సమస్యలు లేవనెత్తారు. ఇటీవల ప్రమాదంలో గాయపడ్డ మున్సిపల్ కాంట్రాక్ట్ ఎలక్ట్రికల్ వర్కర్ సత్యనారాయణకు కౌన్సిల్ సభ్యులందరూ ఒకనెల గౌరవవేతనాన్ని విరాళంగా అందజేయాలని షేక్ యాకూబీ సూచించారు. అలాగే ప్రమాదంలో గాయపడ్డ వాటర్‌వర్క్స్ కార్మికుడికి కూడా విరాళం ఇవ్వాలని గంగరాజు కోరారు. మున్సిపల్ కార్మికులు ప్రమాదాలకు గురికాకుండా వారికి రక్షణ వస్తువులు అందించాలని 1వవార్డు కౌన్సిలర్‌సోమరాజు దుర్గాభవానీ కోరారు. దీనికి సభ్యులంతా అంగీకరించారు. కౌన్సిలర్లు బొంతు రాజశేఖర్, గొల్ల జయరాజ్‌సింగ్, సఖినేటిపల్లి సురేష్, పతివాడ పద్మ, ద్వారా దుర్గాభవానీ, బర్రి జయరాజు, వంగా శ్రీకాంత్ కన్నా పలు సమస్యలపై అధికారులను ప్రశ్నించారు.

సమస్యలను పరిష్కరిస్తా : కమిషనర్

చాలా కాలం తరువాత కౌన్సిల్ సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మున్సిపల్ కమిషనర్ నుంచి సమాధానాలు వచ్చాయి. కొద్దిరోజుల క్రితం కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కె.వెంకటేశ్వర్లు సభ్యులు అడిగిన అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పారు. అంతేకాకుండా పట్టణంలోని సమస్యలను సభ్యుల సమన్వయంతో పరిష్కరించేందుకు కృషి చేస్తానని, పాలనా వ్యవహారాలను గాడిలో పెడతాని తనకు కొంత సమయం ఇవ్వాలని కోరారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణాపాయం



వాహనదారులకు హెల్మెట్ ఉపయోగాలను వివరిస్తున్న ఎస్సై విజయ్ నాగ ప్రసాద్

యలమంచిలి : హెల్మెట్ లేని ప్రయాణం నేరమే కాకుండా ప్రాణాపాయం అని ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్ చెప్పారు. మేడపాడు సెంటర్లో బుధవారం సాయంత్రం ఆయన ద్విచక్ర వాహనదారులను ఆపి హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. రోడ్డు ప్రమాదాలలో తలకు బలమైన గాయాలు కావడం వలన ఎక్కువ ప్రాణనష్టం జరుగుతుందని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. ఐఎస్ఐ మార్కు ఉన్న హెల్మెట్‌ను వాడాలని ఆయన సూచించారు.

ఆర్టీసీతో సురక్షిత ప్రయాణం



కండక్టర్లకు ఫస్ట్ ఎయిడ్ కిట్స్ అందిస్తున్న దృశ్యం

నరసాపురం : ఆర్టీసీ బస్సుల ద్వారా ప్రయాణించడం సురక్షితమని నరసాపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.సుబ్బన్నరెడ్డి సూచించారు. బుధవారం బస్టాండ్‌లో జరిగిన కార్యక్రమంలో పాలకొల్లు న్యూలైఫ్ ఆసుపత్రి వారు సమకూర్చిన ఫస్ట్ ఎయిడ్ కిట్లను కండక్టర్లకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుబ్బన్నరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీలో అనుభవజ్ఞులైన డ్రైవర్లు బస్సులు నడుపుతారని చెప్పారు. ప్రమాదాలు జరిగే అవకాశం దాదాపుగా ఉండదన్నారు. బస్సుల్లో ఫస్ట్‌ఎయిడ్ కిట్స్ ఉంటాయన్నారు. బస్సుల్లో ఏర్పాటు చేయడానికి ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందించిన న్యూలైఫ్ ఆసుపత్రి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యూలైఫ్ ఆసుపత్రి చైర్మన్ తటపర్తి కృష్ణమూర్తి, మేనేజింగ్ డైరెక్టర్స్ తెనాకుల సురేష్, అడ్డాల వాసు, అసిస్టెంట్ డిపో మేనేజర్ ధనలక్ష్మి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వర్మ, సత్తిపండు పాల్గొన్నారు.

29న క్యాంపస్ ఇంటర్వ్యూలు

నరసాపురం : వైఎన్ కళాశాలలో హెచ్‌ఆర్డీ సెంటర్, నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్ అండ్ ఎంప్లాయిమెంట్ సౌజన్యంతో ఈ నెల 29వ తేదీన క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఏపీవీ అప్పారావు చెప్పారు. యాక్సిస్ బ్యాంక్, ముత్తూట్ ఫైనాన్స్‌లో ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు జరుగుతాయని, ఏదైనా డిగ్రీ, పీజీ చేసిన వారు అర్హులని వివరంచారు. ఆసక్తి గలవారు హెచ్ ఆర్డీ సెంటర్ 94400 85679 నంబర్‌కు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

సొసైటీ డైరెక్టర్ మీరాసాహెబ్ మృతి

నరసాపురం : నరసాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం డైరెక్టర్ సోంపల్లి మీరా సాహెబ్ (62) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు ఇద్దకు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతికి సొసైటీ అధ్యక్షుడు షేక్ బులిమస్తాన్ సంతాపం వ్యక్తం చేశారు. గురువారం సొసైటీకి సెలవు ప్రకటించినట్టు చెప్పారు. సొసైటీ అభివృద్ధికి మీరాసాహెబ్ విశేష కృషి చేశారని పేర్కొన్నారు.

ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు



పట్టణంలోని 28వ వార్డులో కరపత్రాలు అందిస్తున్న వలంటీర్లు, గృహసారథులు



మోడి గ్రామంలో లబ్ధిదారులకు బ్రోచర్లు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

నరసాపురం : నరసాపురం నియోజకవర్గంలో జగనన్నే మా భవిష్యత్. మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. నియోజకవర్గంలో మొత్తం 70వేల కుటుంబాలకుగాను ఇప్పటి వరకూ 60వేల కుటుంబాలను వలంటీర్లు, గృహసారథులు, సచివాయాల కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు కలిశారు. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో, నరసాపురం, మొగ్తూరు మండలాల్లోని అన్ని గ్రామాల్లో సాగుతున్న ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. బుధవారం పట్టణంలోని 1 నుంచి 31 వరకూ వార్డుల్లో ఈ కార్యక్రమం సాగింది. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రతి కుటుంబానికి జరిగిన మంచిని వివరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇంటి జయమానుల అంగీకారంతో జగనన్న స్టిక్కర్లు అంటించారు. ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలను వారిచేతనే రాయించి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన వారిచేత సెల్ 62960 82960 నెంబర్‌కు మిస్ట్‌కాల్ ఇప్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. మోడీ గ్రామంలో పార్టీ నేతలు, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పనితీరును వివరించారు. సంక్షేమ పథకాలు అందరికీ అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గృహ యజమానుల అనుమతితో ఇంటి తలుపులకు జగనన్న స్టిక్కర్లు అతికించారు. మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు కావాలంటే జగనన్నే మళ్లీ అధికారంలోకి రావాలని, ప్రజలందరూ మద్దతు పలకాలని కోరారు.

అభివృద్ధి కళ్లకు కనబడడం లేదా?

పితాని, టీడీపీ నేతలపై మండిపడ్డ ఏఎంసీ వైస్ ఛైర్మన్ వీరబ్రహ్మం



ఏఎంసీ వైస్‌ఛైర్మన్ వీరబ్రహ్మం

పోడూరు : తూర్పుపాలెం గ్రామంలో జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాధరాజు చేసిన కోట్లాది రూపాయల అభివృద్ధి పనులు మాజీ మంత్రి పితాని సత్యనారాయణకు, టీడీపీ నేతలకు కనబడడం లేదా..? అని ఆచంట ఏఎంసీ వైస్‌ఛైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం మండిపడ్డారు. తూర్పుపాలెంలో బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల టీడీపీ నిర్వహించిన కార్యక్రమంలో గ్రామాభివృద్ధి జరగడం లేదంటూ స్థానిక ఎమ్మెల్యే శ్రీరంగనాధరాజుపై మాజీ మంత్రి పితాని తో పాటు టీడీపీ నాయకులు చేసిన విమర్శలను ఘాటుగా తిప్పికొట్టారు. పితాని మంత్రిగా ఉండగా టీడీపీ అధికారంలో ఉన్నపుడు గ్రామ సెంటర్‌లో కనీసం బస్టాప్ కట్టలేకపోయారనీ, రూ.80లక్షలతో గ్రామంలో డ్రెయినేజీలు నిర్మిస్తామని చేతులెత్తేశారనీ, బీసీ కమ్యూనిటీ హాలు కడతామని ఎన్నికలకు ముందు హడావిడిగా శంకుస్థాపనలు చేసి చేతులు దులుపుకున్నారనీ, పంచాయతీ కాంప్లెక్స్ పనులు మధ్యలో ఆపేశారనీ వీరబ్రహ్మం గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే శ్రీరంగనాధరాజు ప్రభుత్వ స్థలంలో దాదాపుగా రూ.84 లక్షల వ్యయంతో సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్‌సెంటర్ నిర్మిస్తే ఆ భూమిని అన్యాక్రాంతం చేశారని పితాని, టీడీపీ నాయకులు అర్థంలేని వాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే శ్రీరంగనాధరాజు హయంలో ప్రభుత్వ భవనాలు, డ్రెయినేజీలు, రహదారుల నిర్మాణం, బస్టాప్, వాటర్‌ప్లాంట్ ఏర్పాటు తదితర సదుపాయాలతో గ్రామం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఎమ్మెల్యే శ్రీరంగనాధరాజుకు గ్రామంలో లభిస్తోన్న ఆదరణను చూసి ఓర్వలేక లేనిపోని విమర్శలు చేస్తున్నారన్నారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇర్రింకి శ్రీనివాస్ కూడా టీడీపీ నాయకుల విమర్శలను ఖండించారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి



పశువులకు వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యాధికారి దొమ్మేటి మాధురి

యలమంచిలి : పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి డాక్టర్ దొమ్మేటి మాధురి కోరారు. బుధవారం మేడపాడు గ్రామంలో 86 పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధురి మాట్లాడుతూ వాతావరణ మార్పుల వలన వేసవిలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకుతుందని, దీనివలన పశువులు నీరసించి పాల దిగుబడి తగ్గుతుందన్నారు. ప్రభుత్వం పశుసంవర్థక శాఖ ద్వారా ఈ నెలాఖరు వరకు ఉచితంగా అందిస్తున్న టీకాలను పశువులకు వేయించాలన్నారు. మండలంలోని 32 గ్రామాలలో 8888 పశువులు ఉండగా ఇంత వరకు 8356 పశువులకు టీకాలు వేసినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, ఎంపీటీసీ దేగల సూర్యప్రభ, మాజీ ఉప సర్పంచ్ గంధం సత్యకీర్తి, సచివాలయ కన్వీనర్ అడబాల రాము, గ్రామ కార్యదర్శి మన్నే మాధురి వీఆర్వో తోట శ్రీనివాసరావు వెటర్నరీ అసిస్టెంట్‌లు సీహెచ్ శ్రావణి, టి.వినయ్, వి తరుణ్‌కుమార్, ఎస్.సునంద తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



ఇలపర్రులో రైతులకు సంచులను అందిస్తున్న సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు పద్మావతి

పెనుగొండ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులకు అండగా నిలుస్తున్నారని పెనుగొండ మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి అన్నారు. బుధవారం ఇలపర్రులోని రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, రైతులకు సంచులను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో రైతుల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వేండ్ర వెంకటేశ్వర్లు, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వర్లు, సొసైటీ డైరక్టరు చిన్ని శ్రీనివాస్, దిడ్ల వెంకట్రావు, మాజీ సర్పంచ్ కేతా భీముడు, పీపీసీ ప్రత్యేకాధికారి కాళ్ల రాధాకృష్ణ, సొసైటీ కార్యదర్శి నక్క శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్రీనివాస రామానుజన్ వర్ధంతి



రామానుజన్‌కు నివాళులర్పిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ వర్ధంతి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి సుబ్బలక్ష్మి రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గణిత శాస్త్రానికి రామానుజన్ చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు బీకేవీ రామలక్ష్మి, కె.శివకృష్ణ, ఎస్.శ్రీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల పరిరక్షణ దినోత్సవంగా మే డే



పెనుగొండలో మాట్లాడుతున్న భీమరావు

పెనుగొండ : అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడేను కార్మికుల హక్కుల పరిరక్షణ దినోత్సవంగా కార్మికులు ఘనంగా నిర్వహించుకోవాలని ఏఐటియూసీ జిల్లా అధ్యక్షుడు, పెనుగొండ రైస్ మిల్స్ వర్కర్ల యూనియన్ అధ్యక్షుడు కోనాల భీమారావు కోరారు. బుధవారం పెనుగొండలోని సోమేశ్వర నరశింహ రైస్ మిల్ ఆవరణలో పెనుగొండ ఏరియా రైస్ మిల్స్ వర్కర్ల యూనియన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్మికులు పోరాడి సాధించుకొన్న 44 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేసి లేబర్ కోడ్‌లు తెచ్చిందని దీంతో కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. నాయకులు సిద్ధా బత్తుల పరబ్రహ్మం, వెలగల మాణిక్యాలరెడ్డి, కొప్పిశెట్టి రామలింగం, పెదలక్ష్మి, చినలక్ష్మి పాల్గొన్నారు.

సర్పంచ్ సీతారామ్‌కు అభినందనలు



సర్పంచ్ సీతారామ్‌ను అభినందిస్తున్న శ్రీరంగనాధరాజు

పెనుగొండ : విలేజీ విత్ గుడ్ గవర్నెన్స్‌లో ఉత్తమ పంచాయతీగాను, ఆరోగ్యపంచాయతీగా రెండవ స్థానంలో ఎంపిక కావడానికి కృషి చేసిన కొడమంచిలి సర్పంచ్ సుంకర సీతారామ్‌ను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాధరాజు అభినందించారు. బుధవారం తూర్పుపాలెంలో జరిగిన కార్యక్రమంలో అభినందించి ధ్రువీకరణ పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి సహకరించిన పంచాయతీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశవర్కర్లకు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు చిలుకూరి నరేంద్ర, పోలిశెట్టి వనమరాజు, రొక్కాల రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మానసిక వ్యాధులపై ఆందోళన వద్దు



మానసిక వ్యాధిగ్రస్తులను పరీక్షిస్తున్న డా.హన్నా కోమలి

పాలకొల్లు అర్బన్ : ఫిట్స్, స్కిజోఫ్రీనియా, మతిమరుపు, ఆందోళన చెందుట వంటి లక్షణాలతో పాటు ఆల్కాహాల్, చుట్ట, సిటరెట్, గుట్కా తదితర అలవాట్లు ఉన్నవారు మానసిక రోగులుగా మారతారని, సకాలంలో మందులు వాడితే పూర్తిగా ఆరోగ్యవంతులుగా తయారవుతారని మెడికల్ ఆఫీసర్ డా.హన్నా కోమలి అన్నారు. లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మానసిక రోగుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఏలూరు నుంచి విచ్చేసిన మానసిక వైద్య నిపుణురాలు డా.హన్నా కోమలి 20 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. శ్రీనివాస్ మానసిక వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు గుడాల హరిబాబు, కె ప్రభాకర్, ఫార్మసిస్ట్ పీవీ స్వామి, పీహెచ్ఎన్ ఎలిజబెత్, స్టాఫ్‌నర్స్ సౌజన్య, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు

కాళ్ల: డాక్టర్ దంతులూరి విజయరామరాజు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించినట్లు నిర్వాహకులు ఇందుకూరి ప్రసాద్ రాజు పెనుమత్స విశ్వనాథరాజు తెలిపారు. కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించాలనే ఆలోచనతో దంతులూరు విజయరామరాజు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రంలోని ఆరు జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని అన్నారు. విజయనగరం, విశాఖ స్టీల్ ప్లాంట్, వెస్ట్ గోదావరి, ఎస్వీఆర్ ఫౌండేషన్, శ్రీకాకుళం కృష్ణ జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని వారు స్పష్టం చేశారు. క్రీడాకారులకు అలవెన్సులు, భోజన వసతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయస్థానానికి రూ.25వేలు, తృతీయ స్థానానికి రూ.20 వేలు అందిస్తామన్నారు. పోటీలు కాళ్ల మండలం కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించినట్లు స్పష్టం చేశారు. 30వ తేదీన విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని నిర్వాహకులు తెలిపారు.

రంగమార్తాండ చలనచిత్రం ఉచిత ప్రదర్శన

పాలకొల్లు సెంట్రల్: ఇటీవల విడుదలై ప్రేక్షకాదరణ పొందిన రంగమార్తాండ సినిమాను స్థానిక హరివిల్లు సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో ఉచితంగా ప్రదర్శించారు. బుధవారం స్థానిక అడబాల థియేటర్‌లో ఉదయం ఆటను ఉచితంగా ప్రదర్శించారు. హరివిల్లు అధ్యక్షులు వంగా నరసింహరావు మాట్లాడుతూ ఇంత మంచి సందేశాత్మక చిత్రాన్ని అందించిన దర్శకుడు, నటీనటులకు, చిత్ర యూనిట్ సభ్యులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వల్లభు నారాయణమూర్తి, జక్కంపూడి కుమార్, అడబాల రమణ, సినీ నటులు సారిక రామచంద్రరావు, గుండా రామకృష్ణ, జవ్వాజి శ్రీనివాస్, సీవీవీ సత్యనారాయణమూర్తి, తులా రామలింగేశ్వరరావు, హరివిల్లు సభ్యులు చేగొండి రంగారావు, మండెల భాస్కరరావు, శివాల రామారావు, రావి సూరిబాబు, ఎల్ బి కె మూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

కోలాటం విద్యార్థులకు గజ్జె పూజ



కోలాట విద్యార్థులకు గజ్జెపూజ నిర్వహిస్తున్న వీరాస్వామి

పాలకొల్లు అర్బన్ : చిన్నారులకు ఆధ్యాత్మిక అంశాలపై అవగాహన కల్పించాలని దాస సాహిత్య ప్రాజెక్టు (తిరుపతి) ప్రతినిధి తాడిపత్రి వీరాస్వామి అన్నారు. శివదేవు నిచిక్కాల జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం స్పందన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో హరిహర హరె శ్రీనివాస కోలాట భజన బృందం చిన్నారులు 30 మందికి గజ్జె పూజ నిర్వహించారు. పూజలో భాగంగా విఘ్నేశ్వరుని పూజ, శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీదేవిలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిన్నారుల కాళ్లకు గజ్జెలు కట్టి ఆశీర్వదించారు. స్పందన వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ర్యాలి శుభ, గ్రామ సర్పంచ్ దిడ్ల మణివజ్రం, శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామి ట్రస్ట్‌బోర్డు చైర్మన్ సాధనాల లక్ష్మి, వాకర్స్‌క్లబ్ సభ్యులు కడలి రామలక్ష్మి, నక్కా సుభాషిణి, మంచిగంటి వరలక్ష్మి, ఆముదాలవలస వెంకటలక్ష్మి, గ్రామ పెద్దలు ర్యాలి సతీష్, ర్యాలి శివాజీ, పెన్మెత్స కృష్ణంరాజు, స్వయంవరపు శివన్నారాయణ, వి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిన్నారులు కోలాటం చేశారు.